క్లుప్తంగా

సీపీఐలో చేరిన కౌన్సిలర్ ధర్మరాజు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం 31వ వార్డ్ కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజు గురువారం సీపీఐలో చేరారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు రామాంజనేయ కాలనీకి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. చంద్రగిరి శ్రీనివాస్, వంగా వెంకట్, కంచర్ల జమలయ్య, భుక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీసీలుగా ముస్లింలకు అవకాశం కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను నియమిస్తున్న నేపథ్యాన ముస్లింలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని జిల్లా ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎం.డీ..యాకూబ్‌పాషా ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో ముస్లింలకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. ముస్లింల్లో పలువురు అర్హులు ఉన్నా వీసీలుగా అవకాశం ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైనా ఆలోచన చేయాలని ఆయన కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

ఇల్లెందురూరల్: గౌతమబుద్ధ ఐటీఐ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.కిరణ్ గురువారం ఒక ప్రకటనలతో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, టైలరింగ్ తదితర కోర్సులలో జూన్ 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పాల్వంచ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని శ్రీనివాస కాలనీ మొర్రేడు వాగు నుండి రేగళ్ల ఉయ్యాల వాడకు చెందిన కారం వెంకటేశ్ అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆన్‌లైన్ ప్రక్రియ నిలిపివేత?

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 15వ తేదీ నుంచి సింగరేణి విడుదల చేసిన రెండో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ఆన్‌లైన్ ప్రక్రియను బుధవారం యాజమాన్యం ప్రారంభించింది. కొంతమంది నిరుద్యోగులు ఆన్‌లైన్ చేసుకోగా గురువారం ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, త్వరలో ప్రారంభం అవుతుందని అధికారులు అంటున్నారు. కానీ సరైన తేదీని వివరించకపోవటంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 2017 తరువాత యాజమాన్యం సుమారు 320 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నెలరోజులపాటు ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించిన యాజమాన్యం, ఆకస్మికంగా ఆన్‌లైన్ ప్రక్రియను సాంకేతిక సమస్యతో మళ్లీ వాయిదా వేయటం పట్ల నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కోలిండియా నిబంధనల మేరకు పనిచేయాల్సిన సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువయిందన్నారు. ఇదంతా ఉన్నతాధికారుల పోస్టులను పదిల పరుచుకునేందుకేనని ఆరోపిస్తున్నారు. యాజమాన్యం వెంటనే ఈ సాంకేతిక సమస్యలను తొలగించి ప్రక్రియను ప్రారంభించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

క్రీడా మైదానం కనుమరుగు!

- కేటీపీఎస్ ఏడోదశ క్రీడాకారుల నిరుత్సాహం
- మైదానాన్ని పార్కింగ్‌కు వాడుతున్న పరిస్థితి
- నిర్వహణ కింద చార్జీలు వసూలు



పార్కింగ్ స్థలంగా మారిన కేటీపీఎస్ ఏడో దశ బాస్కెట్ బాల్ క్రీడామైదానం

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు విద్యుత్ ఉత్పత్తిలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ క్రమంలో ఇక్కడి ఉద్యోగులు నిత్యం విధుల్లో తలమునకలు అవుతుంటారు. కాగా అందులో ఆసక్తిగల క్రీడాకారుల పట్ల సంస్థ తగు విధంగా ప్రోత్సహిస్తూ వారిని అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటేలా అనేక అవకాశాలు, సౌకర్యాలు కల్పిస్తుంది. ఈ క్రమంలో అనేక క్రీడామైదానాలను తీర్చిదిద్దింది. జెన్‌కో సంస్థ ఏపీఎస్ఈబీగా ఉన్నప్పటి నుంచి అతిపెద్ద విద్యుత్ కళాభారతి మైదానంతో పాటు అన్నిరకాల ఆటల కోసం ప్రత్యేక కోర్టులకు స్థలాలు కేటాయించడంతో పాటు వాటికి నిధులు వెచ్చిస్తూ నిర్వహణ చేస్తోంది. వీటిల్లో కేటీపీఎస్ ఓఅండ్ఎం, ఏడోదశ క్రీడాకారులకు అతి ముఖ్యమైన బాస్కెట్ బాల్ క్రీడామైదానం ప్రస్తుతం కనుమరుగైంది. కొంతకాలంగా దీని నిర్వహణను మరిచారు. సెంట్రల్ ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న ఈ మైదానం ప్రస్తుతం వాహన పార్కింగ్‌కు వినియోగిస్తుండటం గమనార్హం.

గతమెంతో ఘనం..

కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారాల్లో బాస్కెట్ బాల్ క్రీడాకారులు వందలాది మంది ఉన్నారు. ఏపీఎస్ఈబీ నాటి నుంచి బాస్కెట్ బాల్ ప్రాక్టీస్ చేయడంతో పాటు పోటీల్లో పాల్గొంటున్నారు. ఇక్కడి గ్రౌండ్‌లో ఆడిన ఏఈ, ఏడీఈలు జెన్‌కో సంస్థ డైరెక్టర్లు ఎదిగారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. 7వ దశ క్రీడాకారుల గ్రౌండ్ నిరుపయోగంగా మారగా 5,6 దశల కర్మాగారానికి చెందిన మైదానంలో అక్కడి అధికారుల అనుమతి తీసుకుని ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మెయింటెనెన్స్ ఖర్చు వసూలు...

ఇక్కడ అనేక క్రీడామైదానాలు ఉన్నప్పటికీ వాటిల్లో ఆటలు ప్రాక్టీస్ చేసుకోవాలంటే మెయింటెన్స్ కింద డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానిక క్రీడాకారులు వాపోతున్నారు. టెన్నిస్ గ్రౌండ్‌ను ఇటీవల రూ.25లక్షల నిధులు వెచ్చించి సింథటిక్ కోర్టుగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఉద్యోగులు, క్రీడా ఆసక్తి ఉన్నవారు ప్రాక్టీస్ చేసుకోవాలంటే నెలకు రూ.1,500 చొప్పున డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని, ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్‌కు రూ.1,000 చెల్లించాల్సి వస్తుంది. ఇలా బయటి వ్యక్తులతో మెయింటెనెన్స్ చేయించి డబ్బులు వసూలు చేయడంతో ఇక్కడి క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేటీపీఎస్ గ్రౌండ్‌లో ప్రతీ ఏటా నిర్వహించే బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ తరగతులకు (పిల్లలకు) సైతం రూ.500 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతీసారి క్రీడలకు తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని మీటింగ్‌లలో డైరెక్టర్లు, సీఈలు హామీ ఇస్తున్నారని, కానీ మెయింటెనెన్స్‌ను కూడా సంస్థ కార్మికులతో చేయించి డబ్బులు వసూళ్లను నిలిపివేయాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని క్రీడాకారులు మున్సిపాలిటీ శ్రీనివాస కాలనీ వద్ద ఏర్పాటు చేసిన టెన్నిస్ సింథటిక్ కోర్టుకు వెళుతున్నారు. అక్కడ ఫ్రీగా ఉండటంతో ఇక్కడి గ్రౌండ్‌కు రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ విషయమై కేటీపీఎస్ ఏడో దశ ఇన్‌చార్జ్ సీఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా... దీనిని పరిశీలిస్తానని, ఏ మైదానాన్ని అయినా అందరు వాడుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలు తీసుకుంటానని తెలిపారు.



క్రీడాకారులకు అందుబాటులో ఉన్న కేటీపీఎస్ 5,6 దశల మైదానం

పట్టణాభివృద్ధిపై వ్యాపార సంఘాలతో సమీక్ష



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణాభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ.. చిన్న బజార్, పెద్దబజార్ రోడ్లు, డ్రెయినేజీలు, ఎలక్ట్రికల్ పోల్స్, సులభ్ కాంప్లెక్స్‌లు, రైతుబజార్‌లో పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేస్తే వ్యాపార సముదాయాల్లో అభివృద్ధి జరుగుతుందని వివరించారు. దీంతోపాటు పట్టణంలోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ సమస్యలు పరిష్కరించి వ్యాపార సముదాయాల్లో సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కంభంపాటి దుర్గాప్రసాద్, మొరిశెట్టి భవాని ప్రసాద్, పల్లపోతు వాసు, అబిద్, కూర శ్రీధర్, ముక్కా మధు, అనూప్ ఖండేల్వాల్, బోగా ప్రేమ్‌కుమార్, మనీష్ కుమార్ అగర్వాల్, పల్లపోతు సాయి, మొరిశెట్టి అనీష్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: వర్షాలు సమీపిస్తున్నందున పల్లెల్లో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపర్చడంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామపంచాయతీలను కార్యదర్శులు పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారని అభినందించారు. అదే స్ఫూర్తితో వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలన్నారు. గ్రామాలలో తాగునీటి పథకాలను శుభ్రం చేసి పరిశుభ్రమైన తాగునీరు సరఫరా అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నందున పనికోసం వచ్చిన ప్రతీ కూలీకి పని కల్పించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌కు ఏటీఎఫ్ వినతి



పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌కు ప్రతిపాదన పత్రాలు అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఫిట్‌మెంట్ 42 శాతానికి తగ్గకుండా 2023 నుంచే అమలు చేయాలని టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్‌రావు కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర 2వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్ ఆహ్వానం మేరకు టీఎస్ ఏటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకుల బృందం చైర్మన్‌తో చర్చలు జరిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో హెచ్‌ఆర్‌ఏ 15 శాతం పెంచాలని, ఏహెచ్‌ఆర్‌ఏ 12 శాతానికి పెంచుతూ సీలింగ్ పరిమితి ఎత్తివేయాలని, గత పీఆర్‌సీ సిఫార్స్ చేసిన ఏహెచ్‌ఆర్‌ఏ ఇంకా అమలు చేయనందున ఆ నష్టాన్ని భర్తీ చేస్తూ ఏహెచ్‌ఆర్‌ఏ పెంచాలని కోరారు. కేజీబీవీ, ఐటీడీఏ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, బేసిక్ పే అమలు చేయాలని విన్నవించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. కబ్బాకుల రవి, కుంజ కృష్ణ, పాయం ఆనందరావు, ఊకె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవాలి



డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ: రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతూ మోసం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా వ్యవసాయాధికారి బాబురావుకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కామేష్ మాట్లాడుతూ పాల్వంచ మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్వంచలోని శ్రీలక్ష్మీ ప్రసన్న ఫెర్టిలైజర్స్, సీడ్స్‌లో వరి విత్తనాలు కొనుగోలు చేయగా వ్యాపారి చెప్పినట్లు 40బస్తాలకు బదులు 15 బస్తాలు దిగుబడి కూడా రాలేదన్నారు. ఈ విషయాన్ని యజమాని దృష్టికి తీసుకువెళ్తే నష్టపరిహారం అందజేస్తానని చెప్పి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన డీఏఓను కోరారు. కాగా, వ్యాపారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో పాల్వంచలోని ఫర్టిలైజర్ షాపు ఎదుట సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబు ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. దీంతో ఎస్‌ఐ బి.రాము చేరుకుని వారికి సర్దిచెప్పారు. ఈకార్యక్రమాల్లో నాయకులు, రైతులు సురేశ్‌నాయక్, గుగులోతు భద్రునాయక్, తేజావత్ సాద్, తేజావత్ మంగా, అజ్మీరా కృష్ణ, భూక్యా బాలు, అంగోత్ మోతీలాల్, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

రైతుకూలీలకు జీవన భృతి చెల్లించాలి



మాట్లాడుతున్న రాజు

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు జీవన భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాయిని రాజు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బొర్ర వెంకన్న, బుర్ర రాఘవులు డిమాండ్ చేశారు. పోచారం గ్రామంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేసి వారికి పని భద్రత కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, గీత కార్మికులకు, బీడీ కార్మికులకు ప్రతీనెల రూ.4వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, సామగ్రిని ప్రభుత్వమే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాజు, పాపయ్య, లక్ష్మయ్య, సత్యం, రాములు పాల్గొన్నారు.

రైల్వే భూముల ఆక్రమణలపై పట్టింపేది?



రైల్వే క్వార్టర్ల పక్కన వెలిసిన షెడ్లు

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున రైల్వే భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ భూములను కాపాడాల్సిన అటు రైల్వే, ఇటు మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోజురోజుకు షెడ్లు వెలుస్తున్నాయి. ఈ భూములను గతంలో ఇతర శాఖలకు కేటాయించారు. అయినా ఆక్రమణలు ఆగటం లేదు. రైల్వే స్టేషన్ కొనసాగిన కాలంలో అక్కడి సిబ్బందికి క్వార్టర్లు నిర్మించారు. స్టేషన్ ఎత్తివేతతో క్వార్టర్లు శిథిలమయ్యాయి. ఇప్పుడు వాటిని పలువురు ఆక్రమించి రేకుల షెడ్లు వేసి చుట్టూ పరదాలు కట్టుకుని నివాసం ఉంటున్నారు. తహసీల్ ఎదుట ఇంత జరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. పట్టణంలో స్థలం లేదని పలు విద్యాసంస్థలు ఇతర మండలాలకు వెళ్లిపోయాయి. నిన్న ఓ శ్మశాన వాటికను ఆక్రమించిన సంఘటన మర్చిపోకముందే నేడు రైల్వే భూములను ఆక్రమణ సాగుతోంది.

శాస్త్రీయ ఆలోచనలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న నరేశ్

పాల్వంచ: శాస్త్రీయ ఆలోచనా విధానాలే మానవాభివృద్ధికి దోహదపడతాయని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్ అన్నారు. పట్టణంలోని కొమురం భీం హాల్‌లో బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ ఆలోచనా విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు శాస్త్రీయబద్ధంగా ఆలోచించాలన్నారు. ప్రతీ చిన్న విషయానికి మనస్థాపం చెందడం, అనవసర విషయాలకు ఆవేశపరులుగా తయారై దాడులు, హత్యలు చేయడం వంటివి జరుగుతున్నట్లు చెప్పారు. వందల ఏళ్లుగా ప్రజలను మూఢనమ్మకాల్లో, భ్రమల్లోకి నెడుతున్నారని, వీటి నుంచి బయటికి రావాలన్నారు. కార్యక్రమంలో బరగడి దేవదానం, చిటికెన ముసలయ్య, నిమ్మల రాంబాబు, పూణెం రమేశ్, హుస్సేన్, ముర్తుజా, శ్రీపాద సత్యనారాయణ, ఆంజనేయులు, రవి, భాస్కర్, సంజీవరావు, కరుణ, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది చెరువు చేపలు లేనట్టే..!

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు చేపలంటే జిల్లా ప్రజలందరికీ సుపరిచితమే. ఇక్కడ చేపలు పడుతున్నారంటే చాలు.. ఏపనైనా పక్కన పెట్టి చెరువు దగ్గరకు వెళ్లి చేపలు తెచ్చుకోవాల్సిందే.. ఆ రుచి చూడాల్సిందే.. ఇంతటి ప్రసిద్ధి గాంచిన సింగభూపాలెం చెరువు చేపలు ఈ ఏడాది దక్కేలా లేవు. వానాకాలం చెరువులో వదిలిన చేపలు వర్షాలు లేకపోవడంతో ఆశించిన సైజుకు రాలేదు. దీంతో ఈ ఏడాది చేపల వేటకు బ్రేక్ పడింది. ప్రభుత్వం గత సంవత్సరం సింగభూపాలెం చెరువుకు సుమారు 7 లక్షల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసింది. అయితే అవి చేపలు అరకిలో లోపే ఉన్నాయని, ఆదాయం కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారైనా నాణ్యత కలిగిన చేప పిల్లలను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమ నేతకు నివాళి

కొత్తగూడెంఅర్బన్: తొలి దశ తెలంగాణ ఉద్యమకారుడు కొలిశెట్టి రాందాస్ మృతి రాష్ట్రానికి తీరని లోటని 1969 ఉద్యమకారుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాథ్యూస్ అన్నారు.

కొత్తగూడెంలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం రాందాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాథ్యూస్ మాట్లాడుతూ 1969 కంటే ముందే రాందాస్ ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండ్ర కృష్ణార్జున, కూచన కృష్ణరావు, రామచందర్, కందుకూరి బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, జానీపాషా, కందుకూరి మదనయ్య, అబ్బా రాజయ్య, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గొల్లగూడెం

- ఆరు నెలలుగా తాగునీటి ఎద్దడి
- పారిశుద్ధ్య నిర్వహణ కరువు
- ఓట్లు వేయమని నిరసన వ్యక్తం చేసిన గ్రామస్తులు



పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయమని నిరసన తెలుపుతున్న గొల్లగూడెం గ్రామస్తులు (ఫైల్)

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామ పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. దీంతో తాగునీటి కోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో వెయ్యి మంది జనాభా. వీరు వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం కొనసాగిస్తారు. గ్రామంలో తాగునీటి సరఫరా చేసే బోర్లు పనిచేయక ఆరు నెలలు అవుతుంది. దీంతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ వేసవికాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.



గ్రామంలో పనిచేయని బోరు



డ్రెయినేజీ లేక నిల్వ ఉన్న మురుగు

డ్రెయినేజీలు లేవు.. ఫలితంగా ఇళ్లలోని మురుగు ఇళ్ల ముందే నిల్వ ఉంటోంది. అంతేకాకుండా రేగళ్ల ప్రధాన రహదారి నుంచి గొల్లగూడెం రహదారి వెళ్లే రోడ్డు సరిగా లేదు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది, అయినా పట్టించుకునేవారే లేరు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గొల్లగూడెం గ్రామస్తులు తాగునీటి ఎద్దడితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదు. బోరును మరమ్మతులు చేయించాలని చెప్పినా ఫలితం లేదు.

ఓట్లు వేసేది లేదని నిరసన...

ఈనెల 13వ తేదీన జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గొల్లగూడెం గ్రామంలోని ప్రజలు ఓట్లు వేసేది లేదని నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారించాలని, డ్రెయినేజీలు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు డీఎస్పీ రెహమాన్, ఎస్‌ఐ రమణారెడ్డి అక్కడికి వెళ్లి, ఈ సమస్యను కలెక్టర్ ప్రియాంక దృష్టికి తీసుకెళ్లి తర్వలో సమస్య పరిష్కారిస్తామని హామి ఇవ్వటంతో ఆందోళన విరమించి ఓట్లు వేసేందుకు వెళ్లారు.

తాగునీటి కోసం అల్లాడుతున్నాం..



ఆరునెలలుగా బోరు పని చేయటం లేదు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఈ వేసవికాలంలో తాగునీరు లేక అల్లాడిపోతున్నాం. గొల్లగూడెం దగ్గరలోని మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీళ్లు తెచ్చుకుని వినియోగించుకుంటున్నాం.

– బానోతు కిషన్, గొల్లగూడెం

సమస్యలు పరిష్కరించాలి...



గొల్లగూడెంలో తాగునీటి సమస్యతోపాటు, డ్రెయినేజీలు లేవు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు. ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేయమని నిరసన తెలిపాం. అధికారులు నచ్చజెప్పి ఓట్లు వేయించారు.

– జి.వెంకటరాములు, గొల్లగూడెం

దోమల నివారణతో డెంగీని అరికడదాం..



జూలూరుపాడు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ఇల్లెందురూరల్: కొమరారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



టేకులపల్లిలో ర్యాలీ

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, వైద్యసిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తి చెందకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగీ దోమ మంచినీటిలోనే వృద్ధి చెందుతుందని, ఈ దోమ పగటి సమయంలోనే కుడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోటు వినోద్, సీహెచ్‌ఓ రత్నకుమార్, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్‌ఎంలు రాణి, నాగలక్ష్మి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రపంచంలో ఎక్కువ మరణాలకు కారణం అత్యంత చిన కీటకం దోమేనని మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి టేకులపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. దోమల వృద్ధికి అనుకూలమైన అపరిశుభ్రమైన పారిశుద్ధ్య పరిస్థితులు మానవుడే కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ప్రతీ ఇల్లు, ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా ప్రతీ మంగళవారం, శుక్రవారం విధిగా డ్రైడే పాటిస్తూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, గుజ్జ విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, సక్కుబాయి, ఏఎన్‌ఎంలు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: దోమల నివారణ చర్యలతో డెంగీ జ్వరాలను అరికడుదామని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. కొమరారం పీహెచ్‌సీ పరిధిలో డెంగీ నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ప్రజలను చైతన్యపర్చారు. మాట్లాడుతూ.. డెంగీ జ్వరాలకు కారణమైన దోమలు స్వచ్ఛమైన నీటిలో మాత్రమే జీవిస్తాయని చెప్పారు. ప్రతీఒక్కరు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వం పంపిణీ చేసిన దోమ తెరలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్తగూడెంఅర్బన్: రానున్న వర్షాకాలంలో విష జ్వరాలు, డెంగీ వంటివి రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించాలని 25వ వార్డు కౌన్సిలర్ సాహెరాబేగం అన్నారు. గురువారం డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వారి ఇంట్లో కుండీలలో నిల్వ నీటిని తొలగించి వార్డు ప్రజలకు పలు సూచనలు చేశారు. పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్లలో నిల్వ నీటిని తొలగించాలని సూచించారు.